సాక్షి మంచిర్యాల

సోమవారం । 1 । జనవరి । 2024

7


మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో న్యూఇయర్ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేశారు. కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. 2023కు వీడ్కోలు చెప్పి 2024కు ఘనంగా స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే


సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నల్లాల ఓదెలు

మందమర్రిరూరల్: చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం రాత్రి హైదరాబాద్ సెక్రెటరియేట్‌లో కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఆయన వెంట నాయకులు క్రాంతి, దుర్గం నరేష్ ఉన్నారు.

గుడిపేటలో ఎడ్ల పందేలు


పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలో ఆదివారం ఎడ్ల పందేలు నిర్వహించారు. ప్రేమ్‌సాగర్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయన అభిమాని తిప్పని మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పందేల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 20 మంది పాల్గొన్నారు. హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. ఉత్సాహంగా సాగిన పోటీలను చూసేందుకు గ్రామస్తులతోపాటు, చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులు తరలి వచ్చారు. పోటీల్లో అచ్చులాపూర్ గ్రామానికి చెందిన కోటిపల్లి సాగర్ విజేతగా నిలిచారు. పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ విజేతకు మూడు గ్రాముల బంగారం అందించారు. రన్నర్ పాతమంచిర్యాల కు చెందిన తూముల వెంకటరామయ్యకు ఆరు గ్రాముల వెండి ప్రదానం చేశారు. తృతీయ బహుమతి సాధించిన పెంచాల లక్ష్మణ్‌కు ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు నాలుగు గ్రాముల వెండి అందించారు. నంనూర్‌కు చెందిన అత్తె శ్రీనివాస్ భోజన వసతి కల్పించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న సత్యనారాయణ

మంచిర్యాలఅర్బన్: సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ తెలంగాణ లక్ష్యమని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ అన్నారు. మంచిర్యాలలో పీఆర్‌టీయూ సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పదేళ్లుగా పాఠశాల విద్యలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసినట్లు తెలిపారు. తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రతను కల్పించాలని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రవికాంత్‌రావు, కుమార్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, భారతి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, గంగాధర్ పాల్గొన్నారు.

కొత్త అడుగు



మంచిర్యాల రూరల్: సంబురాల్లో యువతులు

కాలచక్రం గిర్రున తిరిగింది. మరో ఏడాది కనుమరుగైంది. మంచి, చెడులను జ్ఞాపకాలుగా మిగిల్చింది. జిల్లా వాసులు 2023కు ఘనంగా వీడ్కోలు పలికారు. నయా జోష్ మొదలైంది. కొత్త ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలను మోసుకొని వచ్చిన 2024కు జిల్లా వాసులు ఘన స్వాగతం పలికారు. యువ ఆలోచనలు వెల్లివిరిసేలా.. అనుభవాల మార్గదర్శనలో.. నవశకానికి నాంది పలికేలా.. విజయ సోపానాలు వీడకుండా.. లక్ష్యాలను సాధించాలని కోరుకుంటున్నారు. న్యూ ఇయర్ వేడుకలు, ఆశలు, ఆకాంక్షలపై జిల్లాకు చెందిన ప్రముఖుల అభిప్రాయాలు వారి మాటల్లో..

సాంకేతికతపై దృష్టి



మంచిర్యాలక్రైం: ప్రజలకు కొత్త సంవత్సరంలో భద్రత మరింత పెంచుతాం. సాంకేతికతను జోడిస్తాం. పోలీస్ శాఖలో పనిచేసే సిబ్బంది సంక్షేమానికి కృషిచేస్తాం. ప్రజలు వేడుకలను సంతోషంగా జరుపుకునేందుకు ఏటా డిసెంబర్ 31న పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నాం. శాంతిభద్రతల పరిరక్షణకు మా సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారు. అందరి ఆనందమే.. మాకు సంతోషం.

– రెమా రాజేశ్వరి, రామగుండం పోలీస్ కమిషనర్

కొత్త ఏడాది రోజే పుట్టిన



మంచిర్యాలక్రైం: న్యూ ఇయర్‌తోపాటే ఏటా నేను పుట్టిన రోజు జరుపుకుంటాను. ఇది నాకు స్పెషల్. నేను మధ్య తరగతి కుటుంబంలో జన్మించాను. అమ్మనాన్న, సోదరుల ప్రోత్సాహంతో ఐపీఎస్ సాధించాను. పోలీస్ అధికారిగా నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవడం సంతృప్తిగా ఉంది. యువత కొత్త ఏడాది నుంచి చెడు మార్గం విడిచి కొత్త ఆశలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.

– సుధీర్ రాంనాథ్ కేకన్, డీసీపీ, మంచిర్యాల

ప్రతీ ఇంటికి తాగునీరు..



మంచిర్యాలటౌన్: కొత్త సంవత్సరంలో మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తా. ఈమేరకు ప్రణాళిక రూపొందించాం. జనవరి 15 వరకు మంచిర్యాల, నస్పూరు, లక్సెట్టిపేట మున్సిపాలిటీలో ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తాం. రోజు రెండు గంటలు తాగునీరు సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నాం. ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పిస్తాం. గూడెం లిఫ్ట్ ద్వారా యాసంగిలో పంటలకు నీరందిస్తాం.

– ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు


మంచిర్యాల రూరల్: సంబురాల్లో మంచిర్యాల పట్టణ మహిళలు..

ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలి



లక్సెట్టిపేట: నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ప్రణాళిక ఏర్పాటు చేసుకుని ఏడాదిలో వాటిని పూర్తి చేయాలి. నూతన సంవత్సరం అంటే కొత్త క్యాలెండర్ మాత్రమే కాదు, గడిచిన కాలాన్ని ఆలోచిస్తూ.. అనుభవాలను కొత్త లక్ష్యానికి ఉపయోగించుకుంటూ ముందుకు సాగాలి. గడిచిపోయిన కాలం తిరిగిరాదు. యువత భవిష్యత్ లక్ష్యంపై దృష్టి పెట్టాలి. సమయం వృథా చేయకుండా గమ్యం చేరుకునేందుకు శ్రమించాలి.

– జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్

కూలీల సంక్షేమానికి ప్రణాళిక



పాతమంచిర్యాల: నూతన సంవత్సరంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి కూలీల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తుంది. కూలీలందరికీ పనులు కల్పిస్తాం. మహిళా సంఘాల సభ్యులకు రుణాలు మంజూరులో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. – బి. శేషాద్రి, డీఆర్డీవో


మంచిర్యాల రూరల్: మంచిర్యాలలో డ్యాన్స్ చేస్తున్న యువకులు

ముంచుకొస్తున్న ముప్పు...!

- జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- దగ్గు, జలుబుతో ప్రజలు సతమతం
- నమోదవుతున్న కోవిడ్ పాజిటివ్ కేసులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

మంచిర్యాలటౌన్: అసలే చలికాలం.. ఆపై వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో జిల్లాలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. దీంతో జిల్లాను చలి వణికిస్తోంది. ఉదయం పనులకు వెళ్లే వారికి.. ముఖ్యంగా రైతులు, పాల వ్యాపారులు, పేపర్ బాయ్‌లు, కూలీలు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. తెల్లవారుజామున, రాత్రి వేళల్లోనూ మంచు దుప్పటి కమ్ముకుంటోంది. వాతావరణంలో వచ్చిన మార్పులతో ప్రజలు దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి, ఒళ్లునొప్పులతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా మరికొందరు ఇంటివద్దే అందుకు అవసరమైన మందులు వేసుకుంటున్నారు. ఇదే సమయంలో జిల్లాలో కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు అవుతుండడంతో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కోవిడ్ లక్షణాలకు, ప్రస్తుత వాతావరణంలో కలిగిన మార్పులు, చలితో వచ్చే వ్యాధులకు దగ్గరి సంబంధం ఉండడంతో ఏది కోవిడ్, ఏది సీజనల్ వ్యాధో తెలియని పరిస్థితి. కోవిడ్ అనుమానం ఉన్న వారికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతీరోజు కరోనా ర్యాపిడ్ టెస్టులు చేస్తుండగా ఇటీవల ఇద్దరికి పాజిటివ్ నిర్ధారణ కావడం ఆందోళన కలిగిస్తోంది.

జాగ్రత్తలతోనే నివారణ

ఏటా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ఏడాది మంచిర్యాల జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 18 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 13 డిగ్రీలకు పడిపోయాయి. పొగమంచుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు కరోనా జేఎన్-1 వేరియంట్ వ్యాప్తి చెందుతోంది. దీంతో చలి నుంచి రక్షణ కోసం ఉన్ని దుస్తులు ధరించాలని, జనం ఎక్కువగా ఉన్న చోటుకు వెళ్లవద్దని, వెళ్లినా మాస్క్ ధరించాలని, ఆహారం వేడిగా ఉన్నప్పుడే భుజించాలని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడే వారు, వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



నిరుపయోగంగా ఆర్టీపీసీఆర్ కేంద్రం

గత నెల 20 నుంచి జిల్లాలో ర్యాపిడ్ పరీక్షలు, ఫలితాలు

తేదీ	పరీక్షలు	పాజిటివ్
20	35	0
21	150	0
22	153	0
23	148	0
24	140	0
25	140	0
26	130	0
27	146	1
28	126	0
29	116	1
30	131	0

అప్రమత్తంగా ఉండాలి



చలి తీవ్రత పెరగడంతో సరైన జాగ్రత్తలు పాటించకపోతే దగ్గు, జలుబు, ముక్కు కారడం, ఒళ్లు నొప్పులు, జ్వరం, జాయింట్ పెయిన్స్ వంటివి వస్తున్నాయి. చికిత్స పొందితే ఐదు రోజుల్లో తగ్గుతాయి. తగ్గనివారు, అనుమానితులకు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ర్యాపిడ్ టెస్టులు చేస్తున్నాం. కరోనా బారిన పడకుండా ప్రతిఒక్కరూ మాస్క్ ధరించాలి.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

ఆర్టీపీసీఆర్ టెస్టులు ఎప్పుడో?

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కరోనా ర్యాపిడ్ టెస్టులు చేసినప్పుడు పాజిటివ్ వస్తే వెంటనే ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. అందులోనూ పాజిటివ్‌గా వస్తే వారి బ్లడ్‌శాంపిళ్లను హైదరాబాద్‌కు పంపించి జీనోమ్ టెస్టు ద్వారా కరోనా జేఎన్ 1 వేరియంట్‌గా నిర్ధారిస్తారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గత కోవిడ్ సమయంలోనే ఆర్టీపీసీఆర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. కానీ కిట్లు లేకపోవడంతో కోవిడ్ పరీక్షలు చేయలేని పరిస్థితి. గత నెల 27న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యుడికి ర్యాపిడ్ టెస్టులో కరోనా పాజిటివ్ వచ్చింది. కిట్లు లేకపోవడంతో పూర్తిస్థాయి నిర్ధారణ కోసం ఆర్టీపీసీఆర్ టెస్టు చేయలేదు.

దూసుకొచ్చిన మృత్యువు



నిర్మల, స్వాతి మృతదేహాలు


ఢీ కొట్టిన వ్యాన్

- రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు దుర్మరణం
- రోడ్డు దాటుతుండగా ఢీకొట్టిన వ్యాన్
- సీసీ కెమెరాల్లో ప్రమాద దృశ్యాలు

కాసిపేట: కొత్త సంవత్సరం సందర్భంగా ప్రార్థనల్లో చర్చికి వెళ్తున్న తల్లీకూతురుపైకి లారీ మృత్యువు రూపంలో దూసుకువచ్చింది. జాతీయ రహదారి దాటుతుండగా ఇద్దరినీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్వరి చర్చి సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి కథనం ప్రకారం.. జిల్లాలోని నస్పూర్‌కు చెందిన వేల్పుల నిర్మల(44), వేల్పుల స్వాతి(21) ప్రార్థనల కోసం కాసిపేట సమీపంలోని కల్వరి బయల్దేరారు. చర్చి సమీపంలో రాత్రి వాహనం దిగి రోడ్డు దాటుతుండగా మందమర్రి నుంచి బెల్లంపల్లి వైపునకు వెళ్తున్న బొలేరో వ్యాన్ వేగంగా దూసుకొచ్చి ఢీకొట్టింది. ఈ చర్చి సమీపంలోనే ఘటన జరుగడంతో స్థానికులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. కొన ఊపిరితో కొట్టుకుంటున్న వారిని 108లో బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఇద్దరూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుల వద్ద ఉన్న బ్యాగ్‌లో లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా మృతులు నస్పూర్‌కు చెందిన వారిగా గుర్తించారు. ఇదిలా ఉండగా ప్రమాద దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదైనట్లు సీఐ తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సీవోఈ విద్యార్థుల ఆటవిడుపు


మామిడి చెట్టెక్కిన చిన్నారులు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీవోఈ) బెల్లంపల్లి విద్యార్థులు ఆదివారం క్షేత్ర పర్యటనకు వెళ్లారు. కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఉన్న వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. అనంతరం అక్కడే సాయంత్రం వరకు ఆట పాటలతో గడిపారు. పసందైన వంటలు ఆరగించారు. రోజంతా ప్రకృతి ఒడిలో గడిపి పరవశించారు.

క్లుప్తంగా

గుంతలో పడిన ఐచర్ వ్యాన్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోని గుంతలో ఐచర్ వ్యాన్ దిగబడింది. ఈ సమయంలో అటుగా ఎవరు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ షాహిద్ వివరాల ప్రకారం... హైదరాబాద్ నుంచి కోడిగుడ్లు తీసుకొని ఉత్తరప్రదేశ్‌లోని జన్‌షీర్ వెళ్తుంది. ఇందారం క్రాస్ రోడ్డు వద్ద వ్యాన్ డ్రైవర్ దారి తప్పి చెన్నూర్‌కు వచ్చాడు. దారి తప్పి వచ్చిన విషయాన్ని స్థానికులు తెలుపడంతో వ్యాన్ తిరుగు ప్రయాణంలో నడి రోడ్డుపై గల గుంతలో పడిపోయింది. అంబేద్కర్ చౌరస్తా జనసంచారం ఉన్న ప్రాంతం కావడంతో వ్యాన్ బోల్తాపడితే పెను ప్ర మాదం సంభవించేదని స్థానికులు చెబుతున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రామకృష్ణాపూర్: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ ఏరియాకు చెందిన ఆర్.శ్రీధర్(36) ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. శ్రీధర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆసరా కల్పించాలని..



కెరమెరి: గత సంవత్సరం పర్వాలేదనిపించింది. వ్యాపారం బాగానే సాగింది. కానీ తాను అనుకున్నంత యువతకు ఉద్యోగావకాశాలు కల్పించలేకపోయాను. గతేడాది ఏడుగురికి సీడ్స్, ఫర్టిలైజర్స్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించాను. 2024లో ఆ వెలితి లేకుండా చేస్తాను. మరో పది మంది వరకు చదువుకున్న యువకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాను. నూతన ఏడాది అందరూ సంతోషంగా ఉండాలి.

– గిత్తే తిరుపతి, వ్యాపారి, సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్, కెరమెరి

ఉత్తమ ఫలితాల కోసం



మంచిర్యాలఅర్బన్: గతేడాది ఇంటర్‌లో 82శాతం మేర ఫలితాలు సాధించాం. ఈ ఏడాది జరిగే ఇంటర్‌లో ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాలు బోధించి ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాం. నూటికి నూరు శాతం ఫలితాలు సాధించేలా ముందుకు సాగుతున్నాం. ప్రస్తుతం కళాశాలల్లో ప్రత్యేక తరగతులు కొనసాగతున్నాయి. రానున్న పరీక్షలకు భయాందోళన వీడి ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకుంటూ సన్నద్ధం కావాలి.

– శైలజ, డీఐఈవో, మంచిర్యాల

కొత్త ఆలోచనతో..

గడిచిన ఏడాదికి బైబై చెబుతూ... నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కొత్త ఏడాదిలో జీవితాన్ని నూతనంగా ప్రారంభించేందుకు సంసిద్ధమయ్యారు. పలువురు ప్రణాళిక పరంగా 2024లో ముందుకు సాగాలని, మరికొందరు 2023లో జరిగిన పొరపాట్లను మళ్లీ పునరావృత్తం కాకుండా చూసుకోవాలని కోరుకుంటున్నారు. ఈ కొత్త ఏడాది.. జీవితం కొత్తగా సాగాలని పలువురు కోరుతున్నారు. వారి అభిప్రాయాలు ఈ కింది విధంగా.. – సాక్షి నెట్‌వర్క్

ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తా



బెల్లంపల్లి: నూతన సంవత్సరంలో లక్ష్యాన్ని ఎంచుకుని ప్రతి ఒక్కరూ ఆ ఏడాదంతా అందుకు తగిన విధంగా వ్యవహరించడం జరుగుతుంది. అదే విధంగా నేను కూడా ఈ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సరి కొత్త నిర్ణయం తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నాను. డబ్బులను జల్సాలకు ఖర్చు చేయకుండా ఆర్థిక క్రమ శిక్షణను పాటించాలని అనుకుంటున్నాను.

– తరుణ్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, బెల్లంపల్లి

పుస్తక పఠనం చేస్తా..



మంచిర్యాలక్రైం: ఈ నూతన సంవత్సరంలో మంచి 15న వలలు చదువాలని నిర్ణయం చేసుకున్న. గతేడాదిలో ఒక్కసారి 'చివరికి మిగిలేది' అనే నవల చదివాను. కొన్ని కారణాలతో ఆగిపోయింది. ఈ ఏడాదిలో బుక్ షాపింగ్ చేసి గోపీచంద్ రచించిన నవల 'ఆ సముద్రుడి జీవిత యాత్ర', కొరవగంటి కుటుంబరావ్ రచించిన నవల 'చదువు' బుచ్చిబాబు రచించిన నవల 'చివరికి మిగిలేది' చలం, గురజాడ నవలలు చదువాలని తీర్మానం చేసుకున్న. అలాగే ఆన్‌లైన్ పాఠాలు చేసి తిరుపతి పేరుమీద యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేసి ఎకనామిక్స్ సబ్జెక్టను అప్‌లోడ్‌చేస్తా.

– భూక్యా తిరుపతి, ఎన్‌సీసీ అధికారి, ప్రభుత్వ డిగ్రీ కాలేజి మంచిర్యాల

ఉద్యానపంటల సాగు



పెంచికల్‌పేట్: గత ఏడాది రెండు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాను. వర్షాభావ పరిస్థితులతో దిగుబడి తగ్గి అప్పుల పాలయ్యాను. ఈ సంవత్సరం సంప్రదాయ పంటల సాగుకు స్వస్తి పలికి ఉద్యానవన పంటల సాగు ప్రారంభించాలనుకుంటున్న. నూతన సంవత్సరం మంచి లాభాలు సాధిస్తాను.

– పందిర్ల ప్రమోద్, యువ రైతు, కొండపల్లి

వ్యాయామానికి ప్రాధాన్యం



పెంచికల్‌పేట్: నూతన ఏడాది ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక సమయాన్ని కేటాయించాలని నిర్ణయం తీసుకున్న. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రతిరోజు ఉదయం వాకింగ్ వెళ్లాలని నిర్ణయంచుకున్న. నాతో పాటు మరింత మంది యువకులు వ్యాయామం చేసేలా ప్రోత్సహిస్తా..

– పాలె సుధాకర్, ఎల్లూర్

డైరీ రాయడం అలవాటుగా..



బెల్లంపల్లి: గత కొన్నేళ్ల నుంచి రోజువారీగా డైరీ రాయడం నాకు అలవాటు. ప్రతి సంవత్సరం కొత్త ఏడాది తొలిరోజు నుంచి రోజువారీ దినసరి చర్యను డైరీలో రాయడం అలవాటైంది. ఆ అలవాటు ఉద్యోగ రీత్యా నాకు ఎంతగానో ఉపయోగ పడుతోంది. ఉన్నతాధికారులు చెప్పే విషయాలను డైరీలో రాసుకుని అందుకు అనుగుణంగా వ్యవహరించడం, సమయానుకూలంగా ఆ పనులు చక్కబెట్టడం చేస్తున్నాను.

– ఆర్.భుజంగరావు, మున్సిపల్ కమిషనర్,బెల్లంపల్లి

రైతులకు మరిన్ని సేవలు



పెంచికల్‌పేట్: గతేడాది ఇంటి వద్దే సోలార్ బ్యాటరీల విక్రయ దుకాణం ప్రారంభించారు. గత సంవత్సరం వ్యాపారం బాగుంది.. లాభాలు వస్తున్నాయి. రైతుల పంట పొలాల వద్దకు వెళ్లి సేవలందిస్తున్న. ఈ ఏడాది కొత్త దుకాణం ప్రారంభించి రైతులకు మరింత సేవలు అందిస్తా.

– లోన్కరి రాకేశ్, ఎల్కపల్లి, పెంచికల్‌పేట్

ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా



కౌటాల: గతేడాది ప్రభుత్వ ఉద్యోగం కోసం పలు పోటీ పరీక్షలు రాసిన పేపర్లు లీక్ కావడంతో నిరాశే మిగిలింది. ఈ నూతన సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక కలిగి ప్రిపేర్ అవుతాను. ప్రభుత్వ ఉద్యోగం కోసం గత కొన్ని నెలలుగా సిద్ధ పడుతున్నాను. కొత్త ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కృషి చేయాలి. యువత ప్రత్యేక లక్ష్యం కలిగి ఉండి దానిని సాధించాలి.

– కె.సువర్ణ, యువతి, కౌటాల

అధిక దిగుబడులు సాధిస్తా



ఈ ఏడాది మూడు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశాను. వాతావరణంలో మార్పుల కారణంగా పంటకు పలు తెగుళ్లు సోకాయి. ఈ నూతన ఏడాది ఐదు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తా. పంట మార్పిడి చేసి నూతన పద్ధతుల్లో పంటలు సాగు చేసి ఆర్థికంగా వృద్ధి సాధిస్తాను. యువ రైతులు పంటల సాగులో నూతన పద్ధతులు పాటించాలి.

– డి.రాంప్రసాద్, యువ రైతు, గుండాయిపేట్

పనులు సవ్యంగా జరగాలి..



కెరమెరి: గతేడాది కొంత ఒడిదుడుకుల మధ్య కొనసాగినప్పటికీ 2024 సంవత్సరంలో పనులన్నీ సవ్యగా జరగాలని కోరుతున్నా. ఆయురారోగ్యంతో పాటు కోరిన కోరికలు నెరవేరాలి. జీవితంలో మరింత ఎదగాలి. ఆ భగవంతుడు ఆ శక్తిని కలిగించాలి. ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలి. ఈ సంవత్సరం అందరికి శుభం జరగాలి. ఉన్నతి పొందాలి.

– వై అశ్విని, ఎంఐఎస్–కో ఆర్డినేటర్, ఎంఆర్సీ, కెరమెరి

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ



మంచిర్యాలఅర్బన్: నూతన సంవత్సరంలో నిర్వహించే పదోతరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో మంచి ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపట్టాం. వెనకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం. అభ్యసన పుస్తకాలు అందజేశాం. సంక్రాంతి పండుగ తర్వాత సాయంత్రం కూడా గంటపాటు విద్యార్థులకు సామర్థ్యాల పెంపు లక్ష్యంగా ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేస్తాం.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

ప్రజలు సంతోషంగా ఉండాలి..



చెన్నూర్: నాకంటూ ప్రత్యేకమైన ప్రణాళికలంటూ ఏమిలేవు. గత ఏడాది పిల్లలతో గడపాలని అనుకుని సిద్ధమయ్యా. రోడ్డు ప్రమాదం జరిగిందని ఫోన్ వస్తే వెళ్లాను. కేసు రీత్యా రోజంతా అక్కడే సరిపోయింది. ఆ ఏడాది నుంచి ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేయడం లేదు. ఉద్యోగ రీత్యా నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిందే. ఈ కొత్త సంవత్సరంలో నేను కొరుకునేది ఒక్కటే. ప్రజలు సంతోషంగా ఉండాలి. నూతన సంవత్సరాన్ని పిల్ల పాపలతో అందరు సంతోషంగా జరుపుకోవాలి.

–వాసుదేవరావు, సీఐ, చెన్నూర్

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

చెన్నూర్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పక్కన గల వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట కారు, మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. వేమనపల్లి మండలం భయ్యారం గ్రామానికి చెందిన శ్రీశైలం, తిరుపతి అనే ఇద్దరు యువకులు చెన్నూర్ మండలంలోని ఎల్లక్కపేట నుంచి సిరోంచ వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. మంచిర్యాల నుంచి చత్తీస్‌గఢ్‌కు వెళ్తున్న కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీశైలం, తిరుపతిలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్సలకు అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయం సీఐ వాసుదేవరావును వివరణ కోరగా యాక్సిడెంట్ జరిగిన విషయం తెలియడంతో పోలీసులను పంపించి రెండు వాహనాలను పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చామని, ఇరువురి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దొనబండకు చెందిన పొట్టాల వెంకటేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. మంచిర్యాల నుంచి దొనబండలోని ఇంటికి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో గుడిపేట వద్ద మరో ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొట్టింది. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. వెంకటేశ్ తలకు తీవ్ర గ్రాయాలు కాగా మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.



గాయపడిన వెంకటేశ్

నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గంగాధర్

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ నాల్గో తరగతి కేంద్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండూరి గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. హైదరాబాద్‌లోని సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో గంగాధర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ అసోసియేషన్ సహా అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు నియామక పత్రం అందజేశారు. ఆయన ఎన్నికపై సంఘం జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.